వ్యవసాయ రంగం

పోటీ పరీక్షల్లో వ్యవసాయ రంగానికి సంబంధించి అడిగే ప్రశ్నలు సాధారణంగా కింది అంశాల నుంచి వచ్చే అవకాశం ఉంది.

- పంటల విస్తరణ, ఉత్పత్తి
- వ్యవసాయరంగంలో అభివృద్ధి–పెరుగుదల రేట్లు
- వ్యవసాయ రంగం – సమస్యలు
- వ్యవసాయ పద్ధతులు
- వ్యవసాయ సంబంధిత పరిశోధన సంస్థలు

పంటల విస్తరణను అధ్యయనం చేసేటప్పుడు.. ఏ రకమైన పంట సాగు.. ఏయే ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉందో భారతదేశ పటం పరిశీలించి జాగ్రత్తగా గమనించాలి. దీనివల్ల విషయ పరిజ్ఞానంతో పాటు పటం ఆధారిత ప్రశ్నలు వస్తే సమాధానాలను గుర్తించడం సులువవుతుంది. వ్యవసాయ రంగంలో అభివృద్ధిని హరిత విప్లవం, పీత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం వంటి అనుబంధ అంశాల ఆధారంగా అధ్యయనం చేయాలి. వీటి ప్రాథమిక సమాచారం తెలుసుకోవడానికే పరిమితం కాకుండా ఆ విప్లవాలు సంభవించడానికి ఏయే అంశాలు దోహదపడ్డాయి? వాటి పరిమితులేమిటి? అనే అంశాలను కూడా నిశితంగా గమనించాలి.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయ సంబంధ పరిశోధన సంస్థల గురించి అధ్యయనం చేసేటపుడు ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్న జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశోధన సంస్థలను గుర్తుంచుకోవాలి. వ్యవసాయ రంగంలో సమస్యలను పంటలు, వ్యవస్థీకృత అంశాలపరంగా విశ్లేషించాలి. వీటి పరి ష్కారానికి ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాల సమాచారాన్ని సేకరించాలి.

నమూనా ప్రశ్నలు :

1. భారతదేశంలో వ్యవసాయం ఏ తరగతికి చెందుతుంది?
   ఎ) విస్తృత బి) సాంద్ర
   సి) వాణిజ్య డి) ఉద్యానవన
2. వ్యవసాయ, వ్యవసాయానుబంధ రంగాలు భారతదేశపు జీడీపీలో సుమారు ఎంత శాతం వాటా కలిగి ఉన్నాయి?
   ఎ) 15 బి) 16
   సి) 22 డి) 25
3. మన దేశంలో కింది వాటిలో ఉద్యానవన పంట ఏది?
   1) కాఫీ 2) తేయాకు 3) మామిడి 4) రబ్బరు
   ఎ) 3 మాత్రమే బి) 1,2,3
   సి) 1,2,4 డి) పైవన్నీ
4. వ్యవసాయం, పశుపోషణ ఒకే వ్యవసాయ భూమిపై ఆధారపడి ఉండటాన్ని ఏమంటారు?
   ఎ) మిశ్రమ వ్యవసాయం
   బి) జీవనాధార వ్యవసాయం
   సి) సాంద్ర వ్యవసాయం
   డి) పైవేవీకావు
5. రబీ వ్యవసాయ కాలం...?
   ఎ) నైరుతి రుతుపవన
   బి) ఈశాన్య రుతుపవన
   సి) రుతుపవన పూర్వ
   డి) రుతుపవన అనంతర
6. భారతదేశంలో దేనిని రబీ పంటగా మాత్రమే పండిస్తారు?
   ఎ) వరి బి) మొక్కజొన్న
   సి) పత్తి డి) గోధుమ
7. దేశంలో ఏ పంటను ఖరీఫ్, రబీ రెండు కాలాల్లోనూ పండిస్తారు?
   ఎ) గోధుమ బి) మొక్కజొన్న
   సి) పత్తి డి) వరి
8. భారతదేశంలో ఏ పంట సాగుకోసం సాగు నీరు తప్పనిసరి?
   ఎ) వరి బి) గోధుమ
   సి) చెరకు డి) జనుము
9. భారతదేశంలో సంప్రదాయకంగా కింది తరగతికి చెందిన వాటిని మార్పిడి పంటలుగా పండిస్తున్నారు?
   ఎ) పప్పుధాన్యాలు బి) ముతకధాన్యాలు
   సి) నూనె గింజలు డి) లెగ్యూమ్ జాతి పంటలు
10. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ఏ పంటసాగు విస్తీర్ణం తగ్గిపోతుంది?
    ఎ) గోధుమ బి) పత్తి
    సి) ముతక ధాన్యాలు డి) పప్పుధాన్యాలు
11. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం ఏ పంట ఉత్పత్తి, ఉత్పాదకతలు అంతగా అభివృద్ధి చెందక స్థిరంగా ఉన్నాయి?
    ఎ) నూనె గింజలు బి) జనుము
    సి) చెరకు డి) పుప్పుధాన్యాలు
12. ప్రపంచ మామిడి పండ్ల ఉత్పత్తిలో భారతదేశం వాటా శాతం?
    ఎ) 40 బి) 45 సి) 50 డి) 55
13. కింద సూచించిన ఏ కూరగాయల ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది?
    ఎ) కాలిఫ్లవర్ బి) క్యాబేజీ
    సి) ఉల్లిగడ్డలు డి) టొమోటా
14. కూరగాయల ఉత్పత్తిలో ప్రపంచ దేశాల్లో భారత్ స్థానం?
    ఎ) మొదటి బి) రెండో
    సి) మూడో డి) నాలుగో
15. ప్రపంచ పాల ఉత్పత్తిలో భారత్ స్థానం?

ఎ) మొదటి బి) మూడో
సి) రెండో డి) నాలుగో

16.కింద సూచించిన ఏ జాతీయ పరిశోధన సంస్థ హైదరాబాద్ నగరంలో లేదు?
ఎ) నేషనల్ అకాడెమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్
బి) సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్
సి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్
డి) డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్

17.కేంద్రీయ ఆలుగడ్డల పరిశోధన సంస్థ ఎక్కడ ఉంది?
ఎ) లక్నో బి) కాన్పూర్
సి) లూధియానా డి) సిమ్లా

18.భారతీయ పప్పుధాన్యాల పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది?
ఎ) లక్నో బి) కాన్పూర్
సి) జబల్‌పూర్ డి) భోపాల్

19.భారతదేశంలో అత్యధికంగా వాణిజ్య పద్ధతుల్లో పూలను ఉత్పత్తి చేసి ఎగుమతి చేస్తున్న రాష్ట్రం?
ఎ) మహారాష్ట్ర బి) గుజరాత్
సి) కర్నాటక డి) తమిళనాడు

20.భారతదేశ కాఫీ రాష్ట్రం?
ఎ) కేరళ బి) కర్ణాటక
సి) తమిళనాడు డి) అస్సాం

21.భారతదేశంలో జనుము సాగు ప్రధానంగా ఏ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది?
ఎ) హుగ్లీ డెల్టా
బి) హుగ్లీ నదీ హరివాణం
సి) డార్జిలింగ్
డి) ఛోటానాగపూర్ పీఠభూమి

22.నూనెగింజల ఉత్పత్తిలో దేశంలో ఆంధ్రప్రదేశ్ స్థానం?
ఎ) మొదటి బి) రెండో
సి) మూడో డి) నాలుగో

23.చెరకు ఉత్పత్తిలో ఇటీవల గణనీయమైన ప్రగతి సాధించిన రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) కర్ణాటక

24.భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ స్థానం?
ఎ) మొదటి బి) రెండో
సి) మూడో డి) నాలుగో

25.భారతదేశంలో వరి పంటను అత్యధికంగా పండించే రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) పశ్చిమబెంగాల్
సి) పంజాబ్ డి) కేరళ

26.మధ్యప్రదేశ్‌లో ప్రధానంగా సాగవుతున్న నూనెగింజల రకం?
ఎ) వేరుశెనగ బి) పొద్దుతిరుగుడు
సి) ఆవ డి) సోయాచిక్కుడు

27.భారతదేశంలో పశ్చిమబెంగాల్ తర్వాత జనుమును అత్యధికంగా ఉత్పత్తి చేస్తోన్న రాష్ట్రం?
ఎ) బీహార్ బి) అస్సాం
సి) ఆంధ్రప్రదేశ్ డి) గుజరాత్

28.కింద సూచించిన పంటల్లో చల్లని వాతావరణంలో పండే పంట?
ఎ) కాఫీ బి) రబ్బరు
సి) తేయాకు డి) చెరకు

29.నీలివిప్లవం ప్రధానంగా ఏ రంగం అభివృద్ధి ద్వారా సాధ్యమైంది?
ఎ) అగాధ సముద్ర భాగాల్లో చేపల వేట
బి) మర పడవల ద్వారా చేపల వేట
సి) సహజసిద్ధ చెరువుల్లో చేపల వేట
డి) ఆక్వాకల్చర్

30.శ్వేతవిప్లవం సాధించడంలో కీలక పాత్ర పోషించిన సంస్థ?
ఎ) ఎన్‌డీఆర్‌ఐ బి) ఎన్‌డీడీబి
సి) సీడీఆర్‌ఐ డి) ఐఐడీడీ

31.పీత విప్లవం (ఎల్లో రెవల్యూషన్)లో భాగంగా భారతదేశంలో ప్రవేశపెట్టిన ప్రధాన నూనెగింజల రకం?
ఎ) పొద్దు తిరుగుడు బి) ఆవ
సి) సోయాచిక్కుడు డి) పామాయిల్

32.భారతదేశం పప్పుధాన్యాలను ప్రధానంగా ఎక్కడి నుంచి దిగుమతి చేసుకుంటోంది?
ఎ) యూఎస్ఏ బి) బ్రెజిల్
సి) దక్షిణాఫ్రికా డి) మయన్మార్

33.ఐఆర్-8, ఐఆర్-10లు ఏ పంటకు సంబంధించిన అధిక దిగుబడినిచ్చే హైబ్రీడ్ వంగడాలు?
ఎ) గోధుమ బి) చెరకు
సి) వరి డి) మొక్కజొన్న

34. దేశంలో హరిత విప్లవంలో భాగంగా గోధుమలో అధిక దిగుబడి కోసం ఏ దేశానికి చెందిన పొట్టి రకం వంగడాల ను ప్రవేశపెట్టారు?
ఎ)మెక్సికో బి) ఫిలిప్పీన్స్
సి) అమెరికా డి) రష్యా

35.దేశంలో అత్యధిక పరిమాణంలో ఏ పంటకు కీటక నాశనులు వాడుతున్నారు?
ఎ) వరి బి) చెరకు
సి) పత్తి డి) జనుము

36.ఏ దేశాన్ని ఆదర్శంగా తీసుకుని భారత్‌లో సహకార రంగంలో పాడి సహకార సంఘాలను స్థాపించారు?
ఎ) బ్రెజిల్ బి) నెదర్లాండ్స్
సి) ఇజ్రాయెల్ డి) డెన్మార్క్

37.'ఆపరేషన్ ఫ్లడ్' పథకం భారత్‌లో ఏ విప్లవానికి దారి తీసింది?
ఎ) హరిత బి) శ్వేత సి) నీలి డి) పీత

38.స్వాతంత్ర్యానంతరం ఏ వ్యవసాయ ఉత్పత్తుల తలసరి లభ్యత

క్రమంగా క్షీణిస్తోంది?

ఎ) నూనెగింజలు　　బి) తృణ ధాన్యాలు

సి) పండ్లు, కూరగాయలు　　డి) పప్పుధాన్యాలు

39. గోధుమను దేశంలోని కింది రాష్ట్రంలో పండించరు?

ఎ) ఛత్తీస్‌గఢ్　　బి) ఆంధ్రప్రదేశ్

సి) కర్ణాటక　　డి) తమిళనాడు

40. ప్రపంచ గేదెల సంఖ్యలో భారత్ వాటా శాతం ఎంత?

ఎ) 30　　బి) 40

సి) 50　　డి) 55

సమాధానాలు

1 బి	2 సి	3 సి	4 ఎ
5 బి	6 డి	7 ఎ	8 సి
9 డి	10 సి	11 డి	12 డి
13 ఎ	14 బి	15 ఎ	16 సి
17 డి	18 బి	19 సి	20 బి
21 బి	22 బి	23 డి	24 సి
25 బి	26 డి	27 ఎ	28 సి
29 డి	30 బి	31 సి	32 డి
33 సి	34 ఎ	35 సి	36 డి
37 బి	38 డి	39 డి	40 డి

వ్యవసాయ వ్యవస్థలు

వ్యవసాయమంటే కేవలం పంటలు పండించటమే కాదు!
ఆర్థిక భౌగోళిక శాస్త్రాలలో దీనిది విస్తృత పరిధి.
వ్యవసాయ అనుబంధ ప్రక్రియలు కూడా వ్యవసాయంలో భాగమే.
ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లోన్ని వ్యవసాయ ప్రక్రియల్లో ఎంతో వైవిధ్యం ఉంది!!

ప్రముఖ ఆర్థిక భౌగోళిక శాస్త్రజ్ఞుడు విట్లిసీ, కింద సూచించిన వ్యవసాయ వ్యవస్థలను గుర్తించాడు.

- సాంద్ర జీవనాధార వ్యవసాయం
- విస్తార వాణిజ్య వ్యవసాయం
- మిశ్రమ వ్యవసాయం
- వాణిజ్య పండ్ల తోటల సాగు
- మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్
- ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్
- వాణిజ్య పాడి మండలం
- వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)
- పోడు వ్యవసాయం
- సంచార పశు పోషణ

సాంద్ర జీవనాధార వ్యవసాయం :

ఆయన, ఉప ఆయనరేఖా ప్రాంతాలకు చెందిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో జీవనాధార సాంద్ర వ్యవసాయం అమలులో ఉంది. ఇండియా, చైనా, బ్రెజిల్, థాయ్‌లాండ్, మెక్సికో, ఈజిప్ట్ వంటి వ్యవసాయ ప్రధాన దేశాలలోని వ్యవ సాయ వ్యవస్థలు ఈ కోవకు చెందినవి. సాంద్ర వ్యవసాయంలో పంటల తీవ్రత అధికం. పెద్ద మొత్తాలలో ఎరువులు, క్రిమిసం హారక మందులు, సేద్యపు నీటిని వాడతారు. వ్యవసాయ భూకమతాల సగటు పరిమాణం చాలా తక్కువ. జనాభాలో అధిక శాతం ప్రత్యక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడతారు. కాబట్టి వ్యవసాయ భూమిపై ఒత్తిడి అధికం. ప్రధానంగా ఆహార పంటలను పండిస్తారు. జనాభా, జనసాంద్రతలు అధికంగా ఉండటం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు పూర్తిగా దేశీయంగానే వినియోగం అవుతాయి..మిగులు లేకపోవటంతోఎగుమతులు అత్యల్పం. వ్యవసాయంలో శ్రామిక శక్తిని అధికంగా వినియోగిస్తారు. సగటు వ్యవసాయ భూమికి దిగుబడులు అధికంగా ఉన్నప్పటికీ, తలసరి దిగుబడులు కనిష్టంగా ఉంటాయి. వ్యవ సాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉంటుంది. ఈ వ్యవసాయ మండలంలో రైతుల ఆదాయాలు స్వల్పంగా ఉంటాయి. రైతులు తమ గృహ అవసరాల ఆధారంగా పంటలను ఎంచుకుంటారు.

విస్తార వాణిజ్య వ్యవసాయం :

ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్జెంటీనాలలో విస్తార వాణిజ్య వ్యవసాయం అమలులో ఉంది. వ్యవసాయంపై ఆధారపడే శ్రామిక జనాభా శాతం చాలా తక్కువ. వ్యవసాయంలో యాంత్రీకరణ స్థాయి అధికం. వ్యవసాయ భూకమతాలు చాలా పెద్దవి.ఉదాహరణకు యూఎస్ఏలో సగటు భూకమతాల పరిమాణం 1000–1400 హెక్టార్లు. పంటల తీవ్రత, సాంద్ర వ్యవసాయ మండలంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది.

ఈ వ్యవసాయ మండలంలో పంటలు ప్రపంచ మార్కెట్లను దృష్టిలో వుంచుకొని పండిస్తారు. జనాభా, జనసాంద్రతలు తక్కువగా ఉండటం వల్ల స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం తక్కువ. మిగులు వ్యవసాయ ఉత్పత్తుల వల్ల పెద్ద మొత్తాలలో ఎగుమతులు అవుతాయి. విస్తార వాణిజ్య వ్యవసాయం అమలులో ఉండే యూఎస్ ఏ, కెనడా, రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా, ఆస్ట్రేలియాలు ప్రపంచంలో ప్రధాన వ్యవసాయ ఎగుమతిదారులు. ఈ మండలాన్ని ప్రపంచ ధాన్యాగారంగా అభివర్ణిస్తారు. ఈ తరహా వ్యవసాయం విస్తారంగా పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకుంది.

మిశ్రమ వ్యవసాయం :

వ్యవసాయ భూమిపై పంటలే కాక పశుపోషణ కూడా ఆధారపడటాన్ని మిశ్రమ వ్యవసాయంగా వ్యవహరిస్తారు. ఈ తరహా వ్యవసాయంలో పంటల నుంచి వచ్చిన రొట్టను, వ్యవసాయ ఉత్పత్తులను పశుగ్రాసంగా వాడతారు. పశువుల మేతకోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లు ఉండవు. అయితే జీవనాధార వ్యవ సాయంలా కాకుండా, ఈ మండలంలో వ్యవసాయ పంటలు, పశుపోషణ వాణిజ్య తరహాలో జరుగుతుంది. పశ్చిమ, మధ్య ఐరోపాలలో వ్యవసాయం ఈ కోవకు చెందింది. ఈ మండలంలో సగటు వ్యవసాయ భూకమతాల పరిమాణం మధ్యస్థంగా (100–200 హెక్టార్లు) ఉంటుంది.

వాణిజ్య పండ్ల తోటల సాగు :

మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతాలు పండ్ల తోటల సాగుకు అనుకూలం. కవోష్ణ వాతావరణం ముఖ్యంగా సిట్రస్ జాతికి చెందిన పండ్ల తోటలు ఇక్కడ సాగవుతాయి. మధ్యధరా తీరంలోని ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, గ్రీస్, మొరాకో, అల్జీరియా, ట్యునీషియా ప్రాంతాలు, దక్షిణ ఆఫ్రికాలోని కేప్ ప్రాంతం, యూఎస్ఏలోని కాలిఫోర్నియా తీరం, మధ్య చిలీ, ఇజ్రాయెల్ తీర ప్రాంతాలు ఈ వ్యవసాయ మండలం కిందకు వస్తాయి. ఈ ప్రాంతాలలో బత్తాయి, నిమ్మ, ద్రాక్ష, నారింజ, దానిమ్మ వంటి సిట్రస్ పండ్ల జాతులను వాణిజ్య పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఇది పెట్టుబడితో కూడుకున్న వ్యవసాయం. పండ్ల రసాలు, జామ్‌లు, జెల్లీలు, సాస్‌లు, ఎండబెట్టిన పండ్లను ఈ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఎగుమతి చేస్తున్నారు. ద్రాక్ష సారాయి తయారీ కూడా పెద్ద పరిశ్రమగా రూపొందింది. ఫ్రాన్స్‌లోని రైన్

లోయ, ఇటలీలోని గెరొన్ బేసిన్ వీటికి ప్రసిద్ధి.

మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్ :

పారిశ్రామిక విప్లవం తర్వాత ఐరోపా, ఉత్తర అమెరికాలలో విస్తృత నగరీకరణ జరిగింది. విస్తరిస్తున్న మెట్రోపాలిటన్ నగరాలలో తాజా కూరగాయలు, పండ్లకు గిరాకీ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో వాయవ్య ఐరోపా, ఉత్తర అమెరికాలలోని పెద్ద, పెద్ద నగరాల సమీపంలో పండ్లు, కూరగాయల సాగు వాణిజ్య పద్ధతిలో ప్రారంభ మైంది. ప్రతిరోజు ఉదయాన్నే ఈ వ్యవసాయ ప్రాంతాల నుంచి నగరాలకు పెద్ద పెద్ద ట్రక్కుల ద్వారా తాజా పండ్లు, కూరగాయల రవాణా జరుగుతుంది. అందువల్లనే దీనిని ట్రక్ ఫార్మింగ్ (మార్కెట్ గార్డెనింగ్) అని పిలుస్తారు. ఆగ్నేయ ఆస్ట్రేలియాలోని నగర జనాభాకు కావాల్సిన తాజా పండ్లు, కూరగాయలను టాస్మానియా దీవి నుంచి బాస్ జలసంధి ద్వారా మర పడవలపై సరఫరా చేస్తారు. అందువల్ల టాస్మానియా దీవిని 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా వ్యవహరిస్తారు.

ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్

ఎస్టేట్ ఫార్మింగ్ పద్ధతులలో ఉద్యానవన తోటల పెంపకం వలస పాలనా కాలంలో వలస రాజ్యాలు ప్రారంభించాయి. ఉష్ణమండల ఆయన, ఉప ఆయనరేఖా ప్రాంతాలలోని వలస దేశాలలో వలస పాలకులు కాఫీ, తేయాకు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, చెరకు, అరటి పంటలను ఎస్టేట్‌ల రూపంలో సాగు చేయటం ప్రారం భించారు. ఈ రకమైన సాగులో వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా నడిపి స్తారు. ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే యాజమాన్యం కేవలం విధాన నిర్ణయాలను మాత్రమే తీసుకుంటుంది. సాగు నిర్వహణ కోసం సుశిక్షుతులైన, సాంకేతిక అర్హతలు ఉన్న వారిని 'మేనేజర్లు'గా వేతన ప్రాతిపదికన నియమిస్తారు. శ్రామికులను దినసరి లేదా రోజువారీ కూలీ ప్రాతిపదికన వినియోగిస్తారు. లాభాలను ఆశించి ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. విదేశీ పెట్టుబడి ఇప్పటికీ ఈ రంగంలో కన్పిస్తుంది.

వాణిజ్య పాడి మండలం :

వాయవ్య ఐరోపాలోని సమశీతోష్ణ వాతావరణంలో విస్తారంగా పచ్చికబయళ్లు పెరుగుతాయి. ఈ పరిస్థితులు పశుపోషణకు అను కూలం, జెర్సి, ఆరిషైర్, స్విస్‌బ్రౌన్, ఆబర్డన్, హార్ట్‌ఫోర్డ్, ఫ్లెచ్‌విక్ వంటి మేలిరకం పాడి పశువుల జాతులకు ఈ ప్రాంతాలు నిలయాలు. పెద్ద మొత్తాలలో పెట్టుబడులు పెట్టి ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని వాడుతూ పాడి పశువులను పెంచుతారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలోని యూకే, డెన్మార్క్, బెల్జియం, నెద ర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, నెదర్లాండ్ దేశాలు పెద్ద మొత్తాలలో పాడి వస్తువులను ఉత్తర అమె రికా, యూరప్‌లోని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తాయి. డెన్మార్క్ దేశాన్ని Butter House of Europeగా అభివర్ణిస్తారు. కొపెన్‌హెగెన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు విమానాల ద్వారా వెన్నను ప్రపంచం నలుమూలలకు ఎగుమతి చేస్తారు.

వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్) :

పశ్చిమ యూఎస్ఏలోని రాకీ పర్వత ప్రాంతం, అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వే దేశాలు రాంచింగ్ (Ranching) మండలం కిందకు వస్తాయి. మాంసం ఉత్పత్తిని ఉద్దేశించి పశువులను పెంచుతారు. పశు పోషణ కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా మొక్కజొన్నను పండిస్తారు. బాగా లావెక్కిన పశువులను యాంత్రిక వధ శాలలలో సంహరించి, మాంసాన్ని యంత్రాల సహాయంతో శుద్ధి చేసి ప్యాక్ చేస్తారు. మాంసం శుద్ధి, ప్యాకింగ్ ఒక పెద్ద పరిశ్రమగా అభివృద్ధి చెందింది. అర్జెంటీనా, ఉరుగ్వే, పెరాగ్వేల నుంచి శుద్ధి చేసిన మాంసాన్ని యూఎస్ఏకు ఎగుమతి చేస్తారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో కూడా రాంచింగ్ అమలులో ఉంది.

సంచార పశు పోషణ :

దట్టమైన అటవీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల నుంచి కొన్ని ఆదిమ తెగల సమాజాలలో ఇప్పటికీ సంచార పశు పోషణ, సంచార వ్యవసాయం అమలులో ఉంది. ఈశాన్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని 'జూమింగ్'గా పిలుస్తారు. మధ్య భారతదేశంలో 'బేవార్' అని, కేరళలో 'పొనమ్' అని పిలుస్తున్నారు. సంచార వ్యవ సాయం బ్రెజిల్ (రోకా), మలేషియా (లడాంగ్)లలో కూడా అమలు లో ఉంది.!!

దేశం	ఎస్టేట్లు	పెట్టుబడి పెట్టిన దేశం
శ్రీలంక	తేయాకు	బ్రిటన్
మలేషియా	రబ్బరు	బ్రిటన్
ఇండోనేషియా	రబ్బరు, చెరకు	డచ్
దక్షిణాఫ్రికా	చెరకు	డచ్, బ్రిటన్
బ్రెజిల్	కాఫీ	పోర్చుగల్
ఫిలిప్పీన్స్	కొబ్బరి	యూఎస్ఏ
కరేబియన్ దీవులు	చెరకు, అరటి	యూఎస్ఏ
పశ్చిమ ఆఫ్రికా	కొకురా	ఫ్రాన్స్

- ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో జీవనాధార సాంద్ర వ్యవసాయం అమలులో ఉంది.
- ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్జెంటీనాలలో విస్తార వాణిజ్య వ్యవసాయం అమలులో ఉంది
- వ్యవసాయ భూమిపై పంటలే కాక పశుపోషణ కూడా ఆధారపడటాన్ని మిశ్రమ వ్యవసాయంగా వ్యవహరిస్తారు.

- మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతాలు పండ్ల తోటల సాగుకు అనుకూలం.
- ద్రాక్ష సారాయి తయారీకి ఫ్రాన్స్‌లోని రైన్ లోయ, ఇటలీలోని గెరొన్ బేసిన్ ప్రసిద్ధి.
- టాస్మానియా దీవిని 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా వ్యవహరిస్తారు.
- డెన్మార్క్ దేశాన్ని Butter House of Europeగా అభివర్ణిస్తారు.
- ఈశాన్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని 'జూమింగ్'గా పిలుస్తారు. మధ్య భారతదేశంలో 'బేవార్' అని, కేరళలో 'పొనమ్' అని పిలుస్తున్నారు.